### కార్యకర్తలే కథానాయకులు



కార్యకర్తలు లేనిదే పార్టీ లేదు. కార్యకర్తలు చెప్పినట్లే పార్టీ ప్రతినిధులు ముందుకెళ్లాలి. బీఆర్ఎస్ పార్టీని నమ్ముకొని పనిచేయండి. అభ్యర్థులు సామాజిక సేవలో అంకితంకావాలి. గ్రామాల్లో బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గురించి చర్చలు జరుపాలి. 93లక్షల మంది రేషన్‌కార్డుదారులకు బీమా సదుపాయం గురించి వివరించండి. కరీంనగర్ ఉమ్మడి జిల్లాతో నాకు 60ఏండ్ల నుంచి అనుబంధం ఉంది. మంత్రి కేటీఆర్ దిశానిర్దేశం ప్రకారం పార్టీ శ్రేణులు నడుచుకొని ఓటర్లను ఆకట్టుకోవాలి. మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి అవగతం కల్పించండి. నాడు ఎండు భూములతో ఉన్న సిరిసిల్ల.. నేడు ఎటు చూసిన నిండిన జలాశయాలు, పచ్చని పంటపొలాలతో కళకళలాడుతున్నది. భూగర్భజలాలు 6.5మీటర్ల ఎత్తుకు పెరిగాయని సర్వే నిమిత్తం సిమ్లా ఇనిస్టిట్యూట్ ఇక్కడికి రానున్నది. ఇక్కడి ధాన్యం ఉత్పత్తులు పెరిగాయి. నేతన్నల బతుకు చిత్రం మారింది. నా అనుభవంలో ఈ తరం అభివృద్ధి చెందినట్లుగా ఏ తరంలో చూడలేదు. సిరిసిల్లలో కొత్త స్వరూపం కనిపిస్తున్నది.

**- కే కేశవరావు, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ**

### బీఆర్ఎస్‌కు బ్రహ్మాండమైన మెజార్టీ



బీఆర్ఎస్‌పై ప్రజలకు విశ్వాసం ఉంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బ్రహ్మాండమైన మెజార్టీతో గెలుస్తుంది. రాజకీయ పార్టీలకు సొంత భవనాలు నిర్మించుకోవడం గర్వకారణం. అధికారంలోకి రాకుముందే తెలంగాణ భవన్ నిర్మించుకొన్న ఘనత సీఎం కేసీఆర్‌ది. 2005లో పునాది వేసి, హైదరాబాద్‌లో తెలంగాణభవన్ కట్టుకున్నాం. అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ నిర్ణయంతో జిల్లాకో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకున్నాం. కేసీఆర్ బీమాతో ఇంటింటికీ ధీమా కలుగుతుంది. కాంగ్రెస్ కర్ణాటకలో హామీ ఇచ్చిన పథకాలను అమలు చేయడంలేదు. 70ఏండ్లలో అప్పటి పాలకులు ఒక్క ఎస్సారెస్పీ జలాశయం నిర్మిస్తే, తొమ్మిదేండ్లలో ఆరు ప్రాజెక్టులు నిర్మించిన ఘన కేసీఆర్‌దే. ఏడు వేల మెగావాట్ల విద్యుత్ నుంచి 26వేల మెగావాట్లకు విద్యుత్‌ను పెంచుకున్నాం. ప్రజలంతా బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలి.

**- బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు**

# తెలంగాణ ఆత్మగౌరవ చిహ్నం బీఆర్ఎస్

- పార్టీ శాశ్వతంగా ఉండాలనే అన్ని జిల్లాల్లో భవనాల నిర్మాణం
- బీఆర్ఎస్ కార్యాలయాలు కార్యకర్తల అస్థిత్వాలు
- కేసీఆర్ బీమా.. పేరు పెట్టింది నేనే
- 45 రోజులు పనిచేయండి.. ఐదేండ్లు సేవ చేస్తాం
- సీఎం కేసీఆర్‌పై ప్రజలకు అచంచలమైన విశ్వాసం
- రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్
- సిరిసిల్లలో తెలంగాణ భవన్ ప్రారంభోత్సవం
- హాజరైన పార్టీ సెక్రటరీ జనరల్ కేశవరావు, మంత్రి గంగుల, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై పార్టీ సెక్రటరీ జనరల్ కేశవరావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యేలు రసమయి, సుంకె, తదితరులు

సిరిసిల్ల/ సిరిసిల్లటౌన్/ తెలంగాణచౌక్, అక్టోబర్ 16 : బీఆర్ఎస్ పార్టీ శాశ్వతంగా ఉండాలనే జిల్లాల్లో పార్టీ కార్యాలయాలను నిర్మిస్తున్నామని, తెలంగాణ ఆత్మగౌరవానికి బీఆర్ఎస్ చిహ్నమని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం 10:30 గంటలకు క్యాంపు కార్యాలయానికి చేరుకున్న ఆయన, అక్కడి నుంచి 11:43 గంటలకు మంత్రి గంగుల , కేశవరావు, వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్‌తో కలిసి తెలంగాణ భవన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి 12:20 గంటలకు తెలంగాణ నూతన భవనంలో అధునాతనంగా నిర్మించిన తెలంగాణ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణికి కేటాయించిన చాంబర్‌లో వారిని కూర్చోబెట్టి, సర్వమత ప్రార్థనలు చేయించారు. అనంతరం వారిని అభినందించారు. అక్కడి నుంచి తెలంగాణ భవన్‌లో రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలను ఆహ్వానించాలని సూచించారు. ప్రతి ఒక్కరం ఓటరు దగ్గరికి పోయి ఓట్లు అడగాలని సూచించారు.

## పార్టీ కార్యాలయాలు కార్యకర్తలందరి ఆస్తి

'పార్టీ కార్యాలయాలు కార్యకర్తల ఆస్తి. సిరిసిల్ల పార్టీ కార్యాలయాన్ని అధునాతనంగా నిర్మించాం. అన్ని కార్యక్రమాలకు అనువుగా ఉండేలా మొదటి అంతస్తులో సమావేశ మందిరం, గ్రౌండ్ ఫ్లోర్‌లో డైనింగ్ హాల్, బస కోసం గదులను నిర్మించాం. త్వరలో టెలికాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేసి నిత్యం కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో మాట్లాడే అవకాశం కల్పిస్తాం. తెలంగాణ భవనం నిత్యం కల్యాణం పచ్చతోరణంలా నిర్వహణ చేపట్టాలని జిల్లా అధ్యక్షుడికి సూచిస్తున్నా. 60 లక్షల పార్టీ సభ్యత్వాలున్న అతి పెద్ద పార్టీ బీఆర్ఎస్సే. పార్టీ కార్యకర్తల్లో పేదలున్నారు. వారి ఇండ్లలో జరిగే శుభకార్యాలను అతి తక్కువ నిర్వహణ ఖర్చులు చెల్లించి తెలంగాణ భవన్‌లో జరుపుకునే విధంగా సహకరించాలి. పార్టీలో అనాథలుంటే వారి పెళ్లిళ్లు పార్టీ తరపున చేయిస్తాం. కులంతార వివాహాలకు ప్రోత్సాహం కల్పిస్తాం. ఇక నుంచి తెలంగాణ భవన్‌లో సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలి. సిరిసిల్లకు వచ్చిన ప్రతి కార్యకర్త తెలంగాణ భవన్‌కు రావాలి. ప్రజావాణిలో దరఖాస్తులు ఇచ్చే ప్రజలు తెలంగాణ భవన్‌కు వచ్చి దరఖాస్తులు ఇవ్వాలి. భవన్‌లో మీడియా పాయింట్ ఏర్పాటు చేసి ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను ఖండిస్తూ బీఆర్ఎస్ నేతలు ప్రెస్‌మీట్‌లు పెట్టాలి. రానున్న రోజుల్లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున తెలంగాణ భవన్‌ను నిర్మిస్తాం. వేములవాడ రాజకీయ కార్యకలాపాలు, సమావేశాలు ఇక్కడే నిర్వహించుకోవాలి. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా తెలంగాణభవన్‌లు నిలుస్తాయి'' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు బాస్‌లు ఢిల్లీలో ఉంటారని, బీఆర్ఎస్‌కు మాత్రం గల్లీలో ఉన్నారని, పైన కేసీఆర్, కింద ప్రజలు మంచిగున్నారని, మధ్యలోనే తెల్ల అంగి నాయకులతో సమస్యలున్నాయని సభలో మంత్రి నవ్వులు పూయించారు.

## కాంగ్రెస్, బీజేపీలే కాపీ కొట్టాయి

'తెలంగాణను కేసీఆర్ తండ్రిలాగా కాపాడుతున్నారు. కేసీఆర్‌ను తిడితే ఓట్లు పడతాయని ప్రతిపక్షాలు అనుకుంటున్నాయి. కానీ, తెలంగాణను కేసీఆర్ కంటే ఎక్కువగా ప్రేమిస్తే తప్ప ఓట్లు పడయన్న విషయం వారికి ఇంకా అర్థం కావడం లేదు. కాంగ్రెస్, బీజేపీలే బీఆర్ఎస్ పథకాలను కాపీ కొడుతున్నాయి. 58 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ తాజాగా, విడుదల చేసిన మ్యానిఫెస్టోలో రైతుబంధుకు డబ్బులు ఇస్తామని ప్రకటించింది. అసలు రైతుబంధు పథకం ప్రవేశపెట్టింది కేసీఆరే. ప్రధాని మోదీ తెలంగాణ పథకాలను కాపీ కొట్టి కేంద్రంలో అమలు చేస్తున్నారు. సీఎం కేసీఆర్ గతంలో ప్రకటించిన మ్యానిఫెస్టోలను 90 నుంచి 95 శాతం అమలు చేశారు. మ్యానిఫెస్టోలను పవిత్రమైన గ్రంథాలుగా గౌరవిస్తూ అమలు చేస్తున్నారు. రెండు సార్లు రుణామాఫీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే'

## నాకిష్టమైన పథకం కేసీఆర్ బీమా

'సీఎం కేసీఆర్ విడుదల చేసిన మ్యానిఫెస్టోలో నాకు ఇష్టమైన పథకం కేసీఆర్ బీమా. ఈ పేరును నేనే సూచించా. తెలంగాణలోని దాదాపు 93 లక్షల తెలుపు కార్డు కలిగిన కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలి. కాళేశ్వర జలాలతో రాష్ట్రం అన్నపూర్ణగా మారింది. జిల్లాలోని ఇల్లంతకుంటలో దాదాపు 25 వేల ఎకరాలు అదనంగా సాగవుతున్నది. బడి పిల్లలకు టిఫిన్, సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నాం. సౌభాగ్యలక్ష్మి ద్వారా అర్హులైన మహిళలకు రూ.3 వేలు అందిస్తాం.'

## గ్రామగ్రామాన అభివృద్ధిని వివరించాలి

'ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామగ్రామాన బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరించాలి. ప్రతి ఇంటికీ చేరిన సంక్షేమ పథకాలు, గ్రామంలో జరిగిన అభివృద్ధి క్రమాన్ని, కేటాయించిన నిధులను వివరించాలి. తొమ్మిదేండ్లలో గ్రామాభివృద్ధిని వివరిస్తూ బ్రోచర్ల ద్వారా ప్రచారం చేయాలి. పార్టీ శ్రేణులు 45 రోజులు కష్టపడితే ఐదేండ్లు మీ కోసం కష్టపడుతాం' అని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో వేదికపై ఉన్న పంచ పాండవులు (కేటీఆర్, గంగుల, చల్మెడ, రసమయి, సుంకె రవిశంకర్)ను గెలిపించాలని మంత్రి కోరడంతో సభాప్రాంగణం చప్పట్లతో మార్మోగింది.

### ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ కేటీఆర్



గాడ్ ఆఫ్ తెలంగాణ కేసీఆర్.. ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ కేటీఆర్. సిరిసిల్లలోని తెలంగాణ భవన్ పార్టీ కార్యాలయం కాదు, ఒక దేవాలయం. ఒక కార్యకర్తగా గర్వపడుతున్నా. కొన్ని పార్టీలు కార్యకర్తలను బానిసలుగా చూస్తాయి. బీఆర్ఎస్ మాత్రం కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్నది. కార్యకర్తలంటే బీఆర్ఎస్‌కు నమ్మకం.. ధైర్యం. భవిష్యత్తు తరాలు బాగుండాలంటే కేసీఆర్ సీఎంగా ఉండాల్సిందే. కర్ణాటకలో కాంగ్రెస్ బియ్యం కూడా ఇచ్చే పరిస్థితి లేదు. ఛత్తీస్‌గఢ్‌లో రైతులకు బోనస్ ఇస్తానన్న ఇవ్వడంలేదు. కేసీఆర్‌ను కాపాడుకుందాం.

**- గంగుల కమలాకర్, పౌరసరాఫరాల శాఖ మంత్రి**

### రుణం తీర్చుకునే తరుణం ఇదే



సీఎం కేసీఆర్ రుణం తీర్చుకునే తరుణం ఇదే. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. సీఎం కేసీఆర్ తెలంగాణను గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పాలనను చేరువ చేసి, కార్యకర్తలకు పార్టీ పరిపాలన భవనాలు నిర్మిస్తున్నారు. కేసీఆర్‌కు పాదాభివందనం. తెలంగాణ భవన్‌ను త్వరితగతిన పూర్తి చేయడానికి సహకరించిన మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో అసలైన ఓట్లు పండుగకు సమష్టిగా వెళుదాం. సిరిసిల్లను అపురూపంగా తీర్చిదిద్దిన కేటీఆర్‌కు విశ్వసనీయతతో గౌరవప్రదమైన గెలుపును కానుకగా అందిద్దాం. సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేద్దాం.

**- తోట ఆగయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు(సిరిసిల్ల)**

### గులాబీ జెండాను ఎగురవేయాలి



రాబోయే ఎన్నికల్లో మరోసారి గులాబీ జెండాను ఎగురవేయాలి. 60లక్షల సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమే. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ దేశానికి రోల్‌మాడల్‌గా నిలిచింది. మ్యానిఫెస్టోను మానవీయ కోణంలో ఆలోచించి ప్రచారం చేయాలి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ వంద శాతం అమలు అవుతున్నాయి. నేను సామాన్య కార్యకర్తను. గులాబీ జెండా కింద ఉన్నందునే నాకు ఎమ్మెల్యే పదవి వచ్చింది.

**- సుంకె రవిశంకర్, చొప్పదండి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి**

### మ్యానిఫెస్టో ఆత్మగౌరవానికి సూచిక



తెలంగాణ భవన కార్యాలయం ప్రారంభోత్సవం నుంచే విజయ ప్రస్థానం ఆరంభమైంది. సీఎం కేసీఆర్ మాట ఇస్తే తప్పకుండా అమలు చేస్తారు. మనందరి మనసులో రామన్న ఉన్నాడు. అప్పటి ఉద్యమ గుర్తులు గుర్తుకొస్తున్నాయి. 2001లో తొలిసారిగా కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ తెచ్చుడో.. అనే నినాదంతో నిధులు, నియామకాలు, నీళ్లు.. అనే విధానంలో గులాబీ జెండాతో పోరాటం చేసినం. ఈ ఉద్యమంలో కొట్ల గొంతుకలను ఏకం చేసిన పార్టీ బీఆర్ఎస్. ప్రజలు రామరాజ్యన్ని కొరుకుంటున్నారు. సీఎం కేసీఆర్ విడుదల చేసిన మ్యానిఫెస్టో బీఆర్ఎస్ కార్యకర్తలకు ఆత్మవిశ్వాసాన్ని అందించింది. ఈ మ్యానిఫెస్టో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సూచిక.

**- రసమయి బాలకిషన్, మానకొండూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి**

### 45రోజులు కష్టపడండి



ఎన్నికల వేళలో విరోధాలు పక్కనపెట్టి ఐకమత్యంగా ఉండాలి. ప్రజాక్షేత్రంలో నమ్మకమైన పార్టీగా బీఆర్ఎస్ స్థిరంగా ఉంది. శాశ్వతంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లు ఏర్పాటు చేస్తున్నది. కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలకు నమ్మకం లేదు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు కనుమరుగుకానున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో 105సీట్లు గెలువబోతున్నాం. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారు. కార్యకర్తలు, పార్టీ శ్రేణులు రానున్న 45రోజులు కష్టపడండి. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయండి. గత ఎన్నికల్లో ఎంపీ ఓటమి జిల్లాకు నష్టం కలిగించింది.

**- చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ వేములవాడ అభ్యర్థి**

### సిరిసిల్లకు వన్నెతెచ్చింది కేటీఆరే



దేశంలోనే సిరిసిల్లకు వన్నెతెచ్చింది కేటీఆరే. సీఎం కేసీఆర్‌తో బీఆర్ఎస్ పార్టీ శాశ్వత రాజకీయ పార్టీగా ఎదిగింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో తెలంగాణలో జీవన ప్రమాణాలు పెరిగాయి. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో పూరించిన శంఖారావంతో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి.

**- ఎల్ రమణ, ఎమ్మెల్సీ**